ఈ వారం కథ

# రూపకర్త

— పైడిపాల

**ఇల్లు కనుచూపు దూరంలో వుండగానే ఆత్రంగా రిక్షాలోంచి వంగి అటుకేసి చూశాను - పల్చగా జనం. రిక్షా వాణ్ణి వేగిరపెట్టి యింటి ముందు ఆగేసరికి చుట్టుపక్కల కళ్ళన్నీ నాకేసి జాలిగా చూస్తున్నాయి.**

నేను బ్రీఫ్‌కేస్ తీసుకొని, గుండెలరచేత్తో పట్టుకొని గుమ్మంకేసి నడిచాను. ఎవరూ మాట్లాడ్డం లేదు. అందరి ముఖాల్లోనూ విషాదం గూడు కట్టుకుంది. నన్ను చూసి అరుగుమీద కూర్చున్న మగాళ్ళు పక్కకు జరిగారు. నా గురించి వాళ్ళు కళ్ళతో మాట్లాడుకోవడం నేను గమనించాను. కాళ్ళు తడబడుతున్నాయి. గుండె దడ ఎక్కువయింది.

తలుపులు తోసేసరికి ఒక ముత్తైదువ వచ్చి దగ్గరకు తీసుకొని "మీరేనా మాష్టారి చెల్లెలు... అయ్యయ్యో అంతా అయిపోయింది తల్లీ... చివరి వరకు మీ పేరే కలవరించాడాయన... మీ కోసం చూసి చూసి కళ్ళ లోంచే పోయింది ప్రాణం..."

నన్ను నడిపించుకొని నీలవేణి వదిన దగ్గరకు తీసు కెళ్ళిందావిడ... స్తంభానికి చేరబడి శోకదేవతలా వున్న వదిన నన్ను కౌగిలించుకొని బావురుమంది.

ఆర్ద్రమైన నా కళ్ళు వదిన భుజం మీద నుంచి అన్నయ్య కోసం వెదుకుతున్నాయి. అన్నయ్య ఎక్కడ... ఇంకా హాస్పిటల్ నుంచి తీసుకొని రాలేదా... లేక...

నా పిచ్చి చూపుల్ని ఎవరో గమనించినట్టున్నారు... "పిచ్చి తల్లి ... అన్నగారి కోసం చూసుకొంటున్నట్టుంది. అంత దూరం నుంచి వస్తుంది. కడసారి చూపుకదా శవాన్ని వుంచమన్నాం. ఆలస్యమై పోతుందని ఎవరూ వినిపించుకోలేదు... ఈ పిల్లకున్న మమకారం తోడబుట్టిన తమ్ముడికి లేకపోయింది..." ఇంక వినలేక పోయాను.

"నో... వీల్లేదు. నేనన్నయ్యను చూడాలి" నేను పిచ్చిగా అరిచాను.

'దయుంచి నాకు మా అన్నయ్యనోసారి చూపిం చరూ?'' చిన్నపిల్లలా ఆ విషయం చెప్పినావిడ్నే పట్టుకొని ప్రాధేయ పడుతున్నాను.

* * *



**ఉపాధ్యాయుడు ఒక రకంగా శిల్పిలాంటివాడు. ప్రత్యేకించి అప్పటికే ఏ రూపమూ లేని పసితనాన్ని. ఒక రూపంలోకి. మార్చడానికి శిల్పి చేసే పనే చేస్తాడు. ఆ ప్రయత్నంలో అప్పు డప్పుడూ ఆ శిల్పి శిల్పాలను నొప్పించవచ్చు కూడా. అది ఉలి కలిగించే నొప్పి లాంటిదనుకోవచ్చు. అటువంటి బాధను భరించకపోతే ఆ ముడిపదార్థం శిల్పం కాదు. ఒక ఆకృతి కల్పించాలన్న ఆలోచనే తప్ప అందులో బాధించాలన్న ఉద్దేశం వుండదు. శిల్పికి శిల్పాలను సృష్టించడంలో దొరికే ఆనందం మరెందులోనూ వుండదు.**

...బస్ సడన్ బ్రేక్‌లో ఆగేసరికి ఉలిక్కిపడి లేచాను. చుట్టూ గాబరాగా చూశాను. సందేహం లేదు - నేను బస్‌లోనే వున్నాను. ఇంతసేపూ గుండెను బరువెక్కించిన ఆ దృశ్యం... రాత్రంతా ట్రైయిన్‌లో సరిగా నిద్రలేక పట్టిన కునుకులో కీడును శంకిస్తున్న మనసు తెర మీద ఆ నీలి నీడలు మాత్రమే... 'అమ్మయ్య... జరిగిందంతా పగటి కల... కీడు పోయింది' బరువు దిగేలా నిట్టూర్చాను.' మా శేఖరం అన్నయ్య చల్లగా వుండేట్టు చూడు స్వామీ' పరి గెడుతున్న బస్‌లో నుంచే రోడ్డు పక్క గుళ్ళో ఆంజనేయ స్వామికి చేతులు జోడించాను. భయంతో కళ్ళు మూతలు పడ్డం మానేశాయి. ఆలోచనలు మాత్రం శేఖరం అన్నయ్య చుట్టూ తిరుగుతున్నాయి.

* * *

సుబ్బరాయుడు పెదనాన్న చనిపోయేసరికి నాది ఆరేడేళ్ళ వయసు. కాని అప్పటి మాటలు కూడా నాకింకా గుర్తున్నాయి. వీధిలో వీరావేశంగా తొక్కుడు బిళ్ళ ఆడుతున్న నన్ను పిల్చి నా కంటె నాలుగైదేళ్ళు పెద్దదయిన ప్రభావతి చెప్పింది - 'పిల్లా, మీ పెదనాన్న చనిపోయాడట - తెలుసా?' అని. చచ్చి పోవడమంటే ఏమిటో సరిగ్గా తెలియని ఆ వయస్సులో అమ్మకు ఆ మాట చెప్దామని ఇంట్లోకి పరిగెత్తాను. వాకిట్లో అమ్మ, అనసూయ పిన్నీ ఆ విషయమే మాట్లాడుకొంటున్నారు పెదనాన్న గారింటికి వెళ్ళి వచ్చినట్టున్నారు.

'వెళ్ళిపోయినాయన అదృష్టవంతుడు. మంచం పట్టకుండా కొడుకు చేతిలో పువ్వులా దాటి పోయాడు. శేఖరం ప్రయోజకుడయ్యాడు. కాని ఆ చిన్నోణ్ణి చూస్తేనే జాలేస్తుంది. అన్నా వదినా ఎంత ప్రేమగా చూసినా తల్లీ దండ్రీ సాటి వస్తుందంటావా?'

అనసూయ పిన్ని జాలిపడుతున్న ఆ చిన్నోడు - వాసు అన్నయ్య అని అర్థమైంది.

"ఆ మాటనకు అనసూయా, అంతకంటే ఎక్కువగా చూస్తాడు మా శేఖరం. మా 'నీల' కూడా ఈ కాలం కోడళ్ళలాంటిది కాదు - వాళ్ళకూ్కడా పిల్లా జెల్లా లేరుకదా. వాసుని కన్న కొడుకులా చూసుకొంటారు- ఆ మాట కొస్తే తండ్రి లేనిలోటు వాసుది కాదు - శేఖరానిదే... బరువంతా అతని భుజాల మీద పడింది" అమ్మ శేఖరం అన్నయ్య మీద సానుభూతి చూపించింది.

"ఆడపిల్ల అక్కెమ్మా లేరు కదా... అంత బరువేముందిలే... మీ బావగారు చేసిన అప్పులున్నట్లు న్నాయి"

"ఆస్తుంది. జీతమొస్తుంది. అప్పులు తీర్చడం సమస్య కాదనుకో... బావగారు పెద్ద పులిలా వుండేవారు. ఆయన కూర్చొని వున్నా అదో ధైర్యం. ... పెద్ద దిక్కు లేకపోవడమంటే ఎంత లోటమ్మా"

అమ్మ, అనసూయ పిన్ని ఇంకా ఆ కుటుంబ విషయాల లోతుల్ని తవ్వుతున్నారు. అప్పటి నుంచీ నాకు శేఖరం అన్నయ్య అంటే గౌరవం, వాసన్నయ్య అంటే జాలి.

ఎనిమిదేళ్ళ క్రితం ఆ గౌరవం రెట్టింపయ్యింది - ఆ జాలి పటాపంచలయింది. డొనేషన్ కట్టి ఇంజనీరింగ్ చదివించిన అన్నయ్య, వదిన ఆస్తినంతా హరించి తనకన్యాయం చేశారనే అభియోగంతో - వాళ్ళతో తెగ తెంపులు చేసుకొని వెళ్ళిపోయాడు వాసు. మళ్ళీ అన్నగారింటి గడప తొక్కనని శపథం చేసి, ఉద్యోగమిప్పించిన మావగారింటికి ఇల్లరికం వెళ్ళిపోయాడు. నాకు తెలిసి అది శేఖరం అన్నయ్య కన్నీళ్ళు పెట్టుకున్న మొదటి రోజు. అన్నయ్య దుఃఖం చూడలేక వాసుకి సర్దిచెప్పబోయాను. వాసు నా మీద విరుచుకు పడ్డాడు.

"మీరందరూ అతగాణ్ణెందుకు వెనకేసుకొస్తున్నారో నాకు తెలుసు. అయినోళ్ళకు ఆకుల్లో, కానోళ్ళకు కంచాల్లో అని, నన్ను పకీరును చేసి ఇంటిని సత్రం చేశాడు. మీలాంటి వాళ్ళందర్నీ ఆదుకొని ధర్మరాజని పించుకొన్నాడు. బంగారం, మీ అందరి దృష్టిలో వాడు శేఖరం ఏమో కాని - నా దృష్టిలో ఖరం"

నన్ను ఆదుకోవడమనే విషయం ప్రస్తావించే సరికి - చిన్నన్నయ్య ముందు ఇక నేను మాట్లాడలేకపోయాను. అవును - మిగతా అక్కల్లాగే ఏ పల్లెల్లోనో పిడకలు చరుచుకొంటూనో, స్త్రీల వ్రత కతలు చదువుకుంటూనో వుండవలసిన దాన్ని - డా. హేమ, ఎం.ఏ.పి.హెచ్.డి. కావడం శేఖరం అన్నయ్య చలవే.

ఆ రోజు నాకు బాగా జ్ఞాపకం. శేఖరం అన్నయ్య వస్తే కూర్చోబెట్టి అమ్మ కుటుంబ సమస్యలేవో చెపుతోంది. అన్నయ్య ఎలిమెంటరీ స్కూలు టీచరు వుద్యోగం వదిలేసి కొత్తగా హైస్కూల్లో టీచరుగా చేరినట్టు చెప్పడానికి వచ్చాడు. మా అన్నయ్య హైస్కూలు టీచరంటే నాకు గొప్పగా గర్వంగా అనిపించింది. అతని కంట పడాలని రెండు మూడు సార్లు ఏదో సాకుతో వాళ్ళ ఎదురుగా తిరిగాను.

"ఇలా రావే బంగారం, ఏం చదువుతున్నావూ?" అంటూ దగ్గరకు పిల్చి బుగ్గ చిదిమాడు శేఖరం అన్నయ్య.

"అయిదో క్లాసు" సిగ్గుతో తలవంచుకొన్నాను.

"హైస్కూల్లో చేరతానంటోందిరా. నేనెక్కడ చదివించగలను చెప్పు. అనకూడదు కానీ ఈ నలుగు రాడపిల్లలతో నరకం అనుభవిస్తున్నాననుకో. మగ దిక్కు లేని సంసారం ... వీళ్ళందరికీ పెళ్ళిళ్ళు చేసి అత్తారిళ్ళకు పంపగలిగితే చాలు. ఈ కాలంలో ఆడపిల్లల్ని చదివించి మాత్రం..."


"అలా అనకు పిన్నీ ... ఆడపిల్లకు నువ్వెంత గొప్ప సంబంధం తెచ్చినా చదువుకు సాటిరాదు. లేనివాళ్ళకెలాగూ లేదు. ఆఖరి పిల్ల చదువుకొంటానంటే వద్దనడం ఎందుకు?- బంగారం నీ తెలుగు వాచకం తీసుకొచ్చి ఓ పాఠం చదువు. ఎలా చదువుతున్నావో చూస్తాను..."

లేడిపిల్లలా పరిగెత్తి వాచకం తీసుకొచ్చి అన్నయ్య చేతికిచ్చాను.

'వివేకానందుడు' పాఠం తీసి చదవమన్నాడు. గడగడ చదివేశాను. 'వెరీగుడ్' అన్నాడు. కొన్ని ప్రశ్నలడిగాడు. చకా చకా సమాధానాలు చెప్పాను. "నువ్వు హైస్కూల్లో చేరుతున్నావు. వెళ్ళి బాగా చదువుకో" అన్నాడు. నా సంతోషానికి పట్టపగ్గాలు లేవు.

నా గురించి అమ్మతో ఏం చెపుతాడో విందామని స్తంభం వెనక నక్కి నిల్చున్నాను.

"పిన్నీ దాని ముఖం మీద మరీ మెచ్చుకోకూడదని చెప్పలేదు కానీ - మన బంగారానికి కొందరు టెన్త్ క్లాసు పిల్లలు కూడా సరిపోరు. దాన్ని చదివించే బాధ్యత నాకు విడిచి పెట్టు. దాన్నెంత దాన్ని చేస్తానో చూద్దువు గాని! "



అన్నమాట నిలబెట్టుకొన్నాదు అన్నయ్య... తను
యం కృషితో ఎస్పెర్సీ క్వాలిఫికేషన్ని ఎమ్మే, బి.ఇడి.
కు పెంచుకొని హైస్కూలు హెడ్మాష్టరయ్యాడు.
న్నమాత్రం యూనివర్సిటీలో వుద్యోగం చేసే
యుకి తీసుకొచ్చాదు.

శేఖరం అన్నయ్య నన్ను కజిన్ సిస్టర్‌గా కాదు - కన్న
తురు లాగే చూశాదు. ఆడపిల్ల తండ్రిని
న్యకోడానికి అపరాధిలా భావించే సమాజంలో 'నా
స్తరు కూతుళ్ళు' అని గర్వంగా చెప్పుకునేవాదు
న్నయ్య. ఆ గర్వాన్ని కాస్తా విరిచేసి వెళ్ళిపోయింది
రిక. అవును - అన్నయ్యకి లేక లేక కలిగిన పుత్రిక
రిక.

'మా బంగారం ఇంట్లో అడుగు పెట్టిన తర్వాతే
రిక కడుపున పడింది' అని అన్నా వదినా నా పాదం
రించి పొగుడుతుంటే - నా భుజాలెంత పొంగి
యేవో, హారికదగా చేసి వెళ్ళిపోయిన తర్వాత అంత
పరాధ భావంతోనూ కుంగిపోయాను.

హారికా, నేనూ ఒక కడుపున పుట్టకపోయినా,
యసులో పన్నెండేళ్ళ తేడా వున్నా - అలాంటి
తేడాపాడాలు తెలియకుండా కలిసిపోయాం. నా పెళ్ళయి
కాపురానికి వెళ్తున్నప్పుడు ఇద్దరం యేడ్చాం - యెడబాటు
ను భరించలేక, నాతో హారికను తీసుకొని వెళ్తానంటే
అన్నా వదినా ఒప్పుకోలేదు - ఎలా ఒప్పుకుంటారు?
కానీ హారికను నాతో తీసుకొని వెళ్ళుంటే ... వెళ్ళుంటే!
ఆ ప్రశ్న జీవితం పొడుగునా మానని గాయంలా
బాధిస్తూనే వుంది.

హారికది చీకట్లో చిదిమి దీపం పెట్టుకొనే అందం
... మనిషి ఎంత అందమైందో అంత మధురమైన
కంఠం. పాటలు పాడ్డం మీద, పత్రికలు చదవడం మీద
వున్న శ్రద్ధ - క్లాసు పుస్తకాల మీద వుండేది కాదు.
ముఖ్యంగా వాళ్ళ నాన్నగారి సబ్జెక్టులు - ఇంగ్లీషు,
లెక్కలలో వెనకబడి వుండేది. హారిక రాంకు స్టూడెంట్
కానందుకు అన్నయ్య బాధపడేవాడు. వదిన మాత్రం
మాతృ ప్రేమతో - 'మేనత్త పోలికలు వచ్చినట్టున్నాయి.
పోన్లెండి తెలుగెమ్మే చదువుతుంది' అని
వెనకేసుకొచ్చేది. దాన్ని గారాబం చేసి చెడగొడుతోందని,
అప్పుడప్పుడూ వదిన మీద ఒంటికాలు మీద లేచేవాడు
అన్నయ్య.

హారికకు టెన్త్ క్లాసు పరీక్షలు ... పరీక్షలో నేను
దగ్గరుంటే తప్ప - అది సరిగా చదవదని, వచ్చి పుణ్యం
కట్టుకోమనీ ఉత్తరం రాసింది వదిన.

'అదేమైనా - ఐ.ఏ.ఎస్. పరీక్షలు రాస్తుందా - అంత
దూరం నువ్వు పని గట్టుకొని వెళ్ళడానికి మీ అన్నయ్య
కుటుంబం మీద వున్న శ్రద్ధలో వందో వంతు మన
సంసారం మీద లేదు' రుసురుసలాడారు మా వారు.

మనుషుల మధ్య సంబంధాలను డబ్బుతో
మాత్రమే తూచే - ఆ ఆర్థిక శాస్త్రోపన్యాసకుణ్ణి
ఒప్పించి మొదటి పరీక్ష పూర్తయిన రోజు బాగా పొద్దు
పోయే సమయానికి గాని అన్నయ్యగారిల్లు
చేరలేకపోయాను - మర్నాడు తెలుగు పరీక్ష. నా రాక వల్ల
హారిక కొంతైనా లాభించాలని ఆశ... కాని గుమ్మంలో

కొంతకాలం తర్వాత తను ఇదివరకున్న హాస్టల్
రూమ్ కెళ్ళాడు రమేష్. రూమంతా తిరుగు
తున్నాడు ఆనందంగా.
"అదే గది, అదే బల్ల, అదే కుర్చీ, అదే కిటికీ,
అదే బీరువా!" అని తనేమని బీరువా తలుపు
తెరిచాడు. అందులో నుంచి ఒకమ్మాయి
బయటికొచ్చింది.
"ఆవిడ మా మేనకోడలు" అన్నాడా
రూమ్‌లో వుండే అబ్బాయి.
"తెలుసు. అదే పాత కథ" అన్నాడు
రమేష్.

—గొల్లపూడి శైలజ

అడుగు పెట్టేసరికి ఇల్లంతా నిశ్శబ్దంగా వుందినదిన తెచ్చి
పెట్టుకున్న నవ్వుతో పలకరిం చింది. నేను వస్తే చాలు -
పరుగెత్తుకొని వచ్చిచుట్టేసే - హారిక రాలేదు... ఆ
వాతావరణం చూడగానే నాకేదో జరిగిందనిపించింది.

"హారిక ఎలా రాసింది? ఏది?- రేపు పరీక్ష పెట్టు
కుని చదవకుండా ... అప్పుడే పడుకుందా?"

"దాని నోసట చదువురాత చెరిపేశారు మీ
అన్నయ్య" వదిన కళ్ళు నీటి చెలములయ్యాయి.

"అదేమిటీ?"

"పేపరు కష్టంగా వుందట. నాచర్లు చూసీ
చూడనట్టు వుంటే - పిల్లలు ఎవరి వీలును బట్టి వాళ్ళు
రాసుకొన్నారట. అందరూ చూసి రాస్తున్నప్పుడు తను
మాత్రం ఎందుకు మడిగట్టుకోవాలని ఎదుటి పిల్ల
పేపర్లోకి తొంగి చూస్తోందట హారిక. ఆ సమయంలో
ఫ్లయింగ్ స్క్వాడ్‌తో కూడా వచ్చిన మీ అన్నయ్య దీన్ని
నిలదీసి డిబార్ చేశారట. ముంజులు తిన్నవాళ్ళు
బావుండి మోరలు తిన్నవాళ్ళ కొచ్చిందని దీని సంగతి
తెలిసి కూడా ఆ రూలు తప్పని పెద్ద మనిషి చేసిన పని
న్యాయంగా వుందంటావా? పెళ్ళాం బిడ్డలు ఏమైనా
ఫర్వాలేదు - ఈయనకు పేరు ప్రతిష్టలు ముఖ్యమట...
దొరికారు మహా అపర ధర్మరాజు. అభినవ
హరిశ్చంద్రుడూ..." ఎప్పుడూ అన్నయ్యను పల్లెత్తి
మాటనని వదిన బాధ అర్థమయ్యింది. దూరంగా ఈజీ
చైర్లో చేరబడివున్న అన్నయ్య వచ్చి సమాధానం
చెప్తాడనుకున్నాను. కాని అన్నయ్య మాట్లాడలేదు.

"అయ్యయ్యో... హారిక ఎక్కడుంది?"

"దాని గదిలోనే వుంది. పొద్దుట నుంచి పచ్చి
మంచినీళ్ళుకూడా ముట్టలేదు. నువ్వెళ్ళి బుజ్జగించి ఓ
ముద్ద తినిపించు తల్లీ"

కంగారుగా దాని గది దగ్గరకు వెళ్ళాను. తలుపులు
చేరవేసి వున్నాయి. తలుపు తోసి లైటు వేశాను. హారిక
మంచం మీద బోర్లా పడుకుని వుంది. నా అడుగుల
చప్పుడుకు కూడా కదులూ మెదులూ లేదు.

'ఏయ్, హారీ — నా బంగారు తల్లీ, లేమ్మా'
అంటూ భుజం మీద చెయ్యేసి లేపబోయాను — చేతికి
మంచు తగిలినట్టు... అదుర్దాగా కుదిపి చూశాను —
మంచం మీద నుంచి ఖాళీ నిద్ర మాత్రల సీసా
కిందపడి బద్దలైంది...!

అలా వృత్తికి అంకితమై పేగునే తెంచేసుకున్న శేఖరం
అన్నయ్య అంటే నాకు ఆరాధన... హారిక మరణానికి
అన్నయ్యే బాధ్యుడని వదినతో సహా ఊరూవాడా అతన్ని
అనరాని మాటలంటే — తండ్రిగా అతనెంతగా
కుమిలిపోయాడో... ఆ గుండెలో ఎన్ని అగ్నిపర్వతాలు
రగిలాయో నాకు తెలుసు... హారిక చనిపోయినప్పుడు
కూడా నాను అన్నయ్య రాలేదు సరికదా — శేఖరం
అన్నయ్య మీద అభాండాలు ప్రచారం చేశాడు!

హారిక నిష్క్రమించిన తర్వాత నాలో హారికను
చూసుకొంటున్నాననే వాడు అన్నయ్య — కాని అది
నిజం కాదు. ప్రతి విద్యార్థిలోనూ అతను హారికను
చూస్తున్నాడు. పిల్లల్ని తన పరిధికి మించిన బాధ్యత
తీసుకుని చదివించేవాడు ... అన్నయ్య క్రమశిక్షణను
తట్టుకోలేని ఓ ఎం.ఎల్.ఎ. కొడుకు — ఆయనను
మారుమూల గ్రామానికి విసిరేయించాడు. నేను
ట్రాన్స్‌ఫర్ ఆపుచేయించడానికి ప్రయత్నిస్తానన్నా వద్ద
న్నాడు అన్నయ్య. "వద్దనుకొన్న వాళ్ళకు బలవంతపు
బ్రాహ్మణార్థం ఎందుకు?" అన్నాడు వేదాంతిలా.

'ఆర్జన కంటె ఉద్యోగానికి ఆత్మ సంతృప్తి ముఖ్యం'
అనే సిద్ధాంతం అన్నయ్యది. అందుకే హెడ్మాష్టరు
కాకుండానే 'జూనియర్ లెక్చరర్'గా అవకాశం వస్తే
తిరస్కరించాడు.

"అంగీకరించి వుండాల్సింది" అన్నాను నేను.

"నాది ప్రైవేటు స్టడీ కదా బంగారం, మీ అంత
స్టాండర్డు మా కెలా వుంటుంది? ఒకోసారి హైస్కూలు
పిల్లలకే న్యాయం చేయడం లేదేమో అనిపిస్తుంది. కాలేజి
పిల్లలకి చెప్పడానికి నా ఇంగ్లీషు పరిజ్ఞానం చాలదు."

అన్నయ్య నిజాయితీ ముందు నేనూ — నాతో
పాటు చాలా మంది అల్పుల మనిపించింది..."నో అది నీ
డిఫిడెన్స్ మాత్రమే. నువ్వు చాలామంది లెక్చరర్ల కంటే
నయం" చిన్నప్పుడు అన్నయ్య నా కిచ్చిన కాంప్లిమెంటు
లాంటిదే నేను తిరిగి అతనికివ్వడం చిత్రమనిపించింది.

"కాదు తల్లీ, నా మీద నీ కున్న అభిమానం కొద్దీ
అలా అంటున్నావంతే..."

* * *

బస్ కుదుపుకి ఆలోచన్లు నిరిగి వర్తమానంలోకి
వచ్చాను. ప్రయాణీకులంతా దిగే హడావిడిలో లేచి
నిల్చున్నారు. హేండ్ బేగ్ తీసి టెలిగ్రాం మరోసారి
చదువుకున్నాను 'బ్రదర్ హాస్పిటలైజ్డ్ - స్టార్ట్'
నీలవేణి.

'ఏ హాస్పిటల్‌లో చేర్చారో... కంప్లైంటు
ఏమిటో... ఇంటికి వెళ్తే తప్ప పరిస్థితి తెలియదు'
యాంత్రికంగా లగేజి రిక్షావాడి చేతికిచ్చి బస్ దిగాను.

* * *

"బంగారం, నిన్ననవసరంగా కంగారు పెట్టాను"
నీలవేణి వదిన నొచ్చుకుంది.

అన్నయ్యకు ప్రమాదం లేదని తెలిసిన తర్వాత పడిన
టెన్షన్ని మర్చిపోయి గుండెల నిండా గాలి తీసుకున్నాను.

ప్రకటన!
ఉద్యోగావకాశములు!
ధరఖాస్తులు
కోరబడుచున్నవి!

ఆంధ్రప్రదేశ్ టెక్నికల్ బోర్డు వారు నిర్వహించు 1) టైలరింగ్ 2) డ్రాయింగ్ పరీక్షల కొరకు శిక్షణ ఇవ్వబడుచున్నది.
ఆంధ్రప్రదేశ్ లో 28 సెంటర్ల నందు పరీక్ష నిర్వహించబడును.
(గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీల నందు)
విద్యార్హత: అన్ని ట్రేడులకు 7th PASS to DEGREE PASS or FAIL
మరియు 3) ఎలక్ట్రిషియన్ 4) రేడియో 5) T.V. మెకానిజం కలదు (కలర్ టీ.వి.)
అన్ని ట్రేడులకు శిక్షణాకాలం 45 రోజులు
జీతం: ఉత్తీర్ణులైన వారు నెలకు రూ॥1250/- నుండి 1650/- రూ. వరకు పొందవచ్చును. శిక్షణ పూర్తి అయ్యే వరకు హాస్టల్ వసతి ఉచితముగా ఇవ్వబడును.
స్త్రీలకు, పురుషులకు వేరువేరుగా హాస్టలు వసతి కలదు. భోజన సదుపాయం కూడా కలదు.
పూర్తి వివరాలకు ఈ క్రింది అడ్రస్‌కు 10 రోజుల లోపు రూ. 5/- M.O. చేసి ధరఖాస్తు ఫారం మరియు పూర్తి వివరములు పొందగలరు.

CORRESPONDENT: Ph:34436
ధనలక్ష్మి ఎంటర్‌ప్రైజెస్
RAMANA
ANNAPURNA TECHNICAL TRAINING CENTRE
BALAJI
(A.P. GOVT. REGD. NO: 3687)
KANKARA GUTTA GATE,
A.T. AGRAHARAM,
GUNTUR-522004
(A.P.)

"ఎంత చెప్పినా వినిపించుకొనేవారు కాదు — బడి కాకుండా ఉదయం రాత్రీ కూడా ఆ టెన్త్ క్లాసు పిల్లలకు కోచింగే. ఈ వయస్సులో పిల్లలనుద్ధరించాలని తన ఆరోగ్యాన్ని పాడుచేసుకున్నారు."

అంతకు మించి అన్నయ్య అనారోగ్యం ఏమిటో వదినకు తెలియదు. ప్రక్కనున్న టౌన్‌లో ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చేర్పారట!

"ఓ, డాక్టరుగారా, రండి రండి" నన్ను చూసి అన్నయ్య ఉత్సాహంగా లేచి కూర్చున్నాడు. నన్ను అంత దూరం నుంచీ రప్పించినందుకు వదినను మంద లిస్తూనే—

"ఈ పిచ్చిదాని ప్రేమ తట్టుకోలేక పోతున్నా నమ్మా... హాస్పిటల్లో నాకేం? శేషశాయిలా హాయిగా పడుకొన్నాను... కాని తిండీ తిప్పలూ మానేసి ఇది పేషంట్‌లా తయారయింది."

అన్నయ్య మాటలకు నా కళ్ళు ఆర్ద్రమయ్యాయి — మావారి నుంచి ఎప్పుడూ అలాంటి ఆప్యాయతకు నోచుకోలేదు నేను.

అన్నయ్య అదే పనిగా మాట్లాడ్డం చూసి - వదిన వారించింది.

"నీ భయం పాడుగాను. మరీ పసిపిల్లాడిలా చూస్తా వేమే! అయినా పక్కన డాక్టరమ్మ వుండగా — ఈ దరిదాపుల్లో కొచ్చే ధైర్యం ఆ రోగాని కెక్కడిది?" అంటూ నా పేరు ముందరి డాక్టర్ని చమత్కరించాడు అన్నయ్య.

నేను కూడా అన్నయ్యను రెస్ట్ తీసుకోమని చెప్పి డాక్టర్ని కలిసి కంప్లైంటు గురించి అడిగాను — నా 'అనుమానం నిజమే — అన్నయ్యకు 'హార్ట్ ఎటాక్!'

"మైల్డ్ స్ట్రోక్. నథింగ్ టు వర్రీ. కాని ఈ విషయం ఆయనకు చెప్పొద్దు."

డాక్టరు సలహా మేరకు ఆ విషయాన్ని అన్నయ్యకే కాదు — వదినకు కూడా చెప్పలేదు. కాని చెప్పక పోయినా అన్నయ్యతో ప్రమాదమే. రాత్రీ పగలూ లేకుండా పిల్లల కోసం మళ్ళీ కష్టపడతాడు. అందుకని ఎక్కువ శ్రమ పడితే ఈసారి ప్రాణం మీదకొస్తుందని డాక్టర్ వార్నింగ్ ఇచ్చినట్టు చెప్పాను.

సాధారణంగా లీవ్ పెట్టడం ఎరగని అన్నయ్య అన్ని రకాల లీవ్‌లు కలుపుకొంటే — దాదాపు ఈ రెండేళ్ళూ పని చెయ్యకుండా గడిపెయ్యొచ్చు. నా సూచనకి అన్నయ్యకి సుతరామూ ఒప్పుకోలేదు —

"వెర్రితల్లీ, డబ్బు ఎప్పుడయినా, ఎలాగయినా సంపాదించవచ్చు. కాని పిల్లలతో కలిసి ఆ వసంతాన్ని పంచుకొనే అదృష్టం మోడయిపోతున్న ఈ చెట్టుకి మళ్ళీ వస్తుందా? అసలే ప్రభుత్వం ఎక్కడ పదవీ విరమణ వయస్సు తగ్గిస్తుందోనని భయపడుతుంటే — ఉన్న దాన్ని వదలుకోమంటావా? రిటైరయ్యే లోగా నూటికి నూరు శాతం ఫలితాలు సాధించి ప్రభుత్వం గుర్తింపు పొందాలి. అప్పుడే నేను నా వృత్తికి న్యాయం చేసినట్టు ..."

అన్నయ్య తపన నాకు తెలుసు. తనతో ఇక వాదించి ప్రయోజనం లేదనీ తెలుసు. నాల్రోజులుండి హాస్పిటల్ నుండి డిశ్చార్జి అయిన తర్వాత నేను ఊరెళ్ళి పోయాను.

మరో రెణ్ణెల్లకి అన్నయ్య భయం నిజమయింది. యాభై అయిదేళ్ళ పరిమితి అమలు కావడంతో అన్నయ్య రిటైర్ కావలసి వచ్చింది. ఈ అశనిపాతాన్ని తట్టుకోలేక అన్నయ్య ప్రాణాని కెక్కడ ముప్పు వస్తుందోనని భయపడి — నేనుస్వయంగా వెళ్ళి కోర్టు తీర్పు అనుకూలంగా వస్తుందని అతనికి ధైర్యం చెప్పాను. కొన్నాళ్ళు అన్నయ్యనూ, వదిననూ మా ఇంటికి వచ్చి వుండడానికి ఒప్పించగలిగాను.

*  *  *

"అన్నయ్యా, నీ వృత్తిలో ఒక్కొక్క మెట్టు ఎక్కిన నీకు పి.హెచ్.డి. చెయ్యాలనిపించలేదా?" యూనివర్సిటీలో నా రూమ్‌లో కూర్చొని పోస్ట్ చూసుకుంటూ అన్నయ్య నడిగాను.

"ఆశకి అంతుండాలి కదమ్మా-నేనెక్కడ? పి.హెచ్. డి. ఎక్కడ?"

"అనుకొంటున్నావు కానీ నువ్వు సునాయాసంగా చెయ్యగలిగేవాడివి...డాక్టరేట్ తీసుకొన్న ఓ అమ్మాయి ఉత్తరం రాసింది చూడు..."

అన్నయ్య మొహమాట పడుతుంటే బలవంతంగా వుత్తరం చేతిలో పెట్టి "మొదటి లైను చదువు చాలు" అన్నాను.

...డా. హేమ మాడమ్ గార్కి శ్రద్ధాంజలి-

"ఇదేమిటమ్మా ఇలా రాసింది?"

"కోపంతోకాదు-కృతజ్ఞతతో శ్రద్ధాంజలి అనే పదానికి అర్థం తెలియదు పాపం. కాని పి.హెచ్.డి. తీసుకొంది. ఇదీ మా స్టాండర్డ్. అర్థమయ్యిందా" నేను మాట్లాడ్డం పూర్తి కాకుండానే ఓ అబ్బాయి వచ్చి విష్ చేశాడు.

"గుడ్ మార్నింగ్ మాడమ్. కనిపించమన్నారట."

"అవునయ్యా? నిన్ను నాకు ఎలాట్ చేశారు. సీటు యిచ్చే వరకూ చుట్టూ తిరుగుతారు. ఇచ్చిన తర్వాత పత్తా వుండరు. ఇన్నాళ్ళూ ఏమైపోయావూ?"

"మేరేజ్ కెళ్ళాల్సొచ్చింది మాడమ్. ఇక మంచి రెగ్యులర్‌గా వస్తాను."

"మరి సబ్జక్టు ఏమైనా అనుకున్నావా?"

"భాషా శాస్త్రంతో ఎం.ఫిల్.తో అవస్థపడి పోయాను. ఈసారి సాహిత్యం తీసుకొందామని వుంది మేడమ్."

"నీ యిష్టం. మరి నీ యింట్రస్టు చెపితే..."

"కథలయితే తేలిగ్గా చెయ్యొచ్చంటున్నారు"

"నీకు కథలు చదివే అలవాటుందా? తెలుగులో మొదటి కథ ఎవరు రాశారు?"

"నన్నయ్య..."

"ఇంకా నయం. ప్రొఫెసర్ నన్నయ్య అనలేదు-గురజాడ పేరు విన్నావా?"

"విన్నాను మేడమ్"

"ఆయన ఏం రాశారు?"

"గుర్తులేదండీ!"

అతని మొహంలోకి చూశాను-ఆ మొహంలో సిగ్గు లేదు; ఎండు నవ్వుతప్ప.

"వారం రోజుల్లోగా గురజాడ రచనలన్నీ చదివి-అప్పుడు కనిపించు వెళ్ళు"

ఇంతవరకూ ప్రేక్షకునిగా గుడ్లు తేలేసి చూస్తున్న అన్నయ్య అతను వెళ్ళగానే తేరుకుని అడిగాడు-

"ఇలాంటి వాడికి సీటు ఇవ్వడం ఎందుకు?-నీకు అప్రతిష్ట కదూ?"

"ఏం చేస్తాం? మెరిట్ ప్రకారం సీటు ఇవ్వక తప్పలేదు. ఇతనికి ఎం.ఎ.లో 75 శాతం మార్కులు వచ్చాయి. ఆపైన ఎం.ఫిల్. చేశాడు"

"నేను నమ్మలేక పోతున్నాను సుమా"

"ట్రూత్ ఈజ్ స్ట్రేంజర్ దేన్ ఫిక్షన్-అంతే... ఈ పరిస్థితి చెప్పినా మీ తరం నమ్మలేరు."

యూనివర్సిటీలో మొదటిసారి అడుగుపెట్టడమేమో-ఆ వాతావరణాన్ని చూసి ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్‌తో బిడియపడిన మా శేఖరం అన్నయ్య-బయటకు వెళ్ళేటప్పుడు తలెత్తి చూడ్డం నేను గమనించాను.

ఆ తర్వాత అయిదారుసార్లు నాతో అన్నయ్య యూనివర్సిటీకి వచ్చాడు. ఇద్దరు ముగ్గురు మెరికల్లాంటి నా పరిశోధక విద్యార్థుల్ని చూసి వాళ్ళ స్థాయికి అబ్బురపడ్డాడు కూడా. ఆ తర్వాత మా వారి కాలేజి కూడా చూస్తానని సరదాపడితే ఎట్టకేలకు ఓ రోజు తీసుకెళ్ళారు. ఆ రోజు సెలవు పెట్టి పెద్దన్నయ్యతోపాటు నేనూ వెళ్ళాను.

"మీరు హేమని మా ఫ్రెండ్స్ ముందు బంగారం అని పిలవకండి-పల్లెటూరి పిలుపులా వుంటుంది" కాలేజీలో అడుగు పెడుతుండగానే శ్రీవారి హెచ్చరిక విని అన్నయ్య చిన్నబుచ్చుకున్నాడు.

మావారు వారి కొలీగ్స్‌ని పరిచయం చేశారు. వాళ్ళలో బెస్ట్ టీచర్ అవార్డు పుచ్చుకొన్న వాళ్ళు కూడా యిద్దరున్నారు. కుతూహలంతో ఆ అవార్డు పద్ధతి గురించి అడిగాడు అన్నయ్య.

"మీరూ మేమూ వేరు కదా-మీకు డి.ఇ.ఓ. రికమెండ్ చెయ్యడమో-ఏదో వుంటుంది. కనుక్కోండి."

రెండు సార్లు ఎగ్జామినర్‌గా సస్పెండ్ చేయబడి కూడా-రాజకీయ ప్రాపకంతో అవార్డు అందుకున్న కామర్స్ లెక్చరర్ భూషణరావు అన్నయ్యకి సలహాయిచ్చి హడావిడిగా వెళ్ళిపోయాడు.

"అదనపు అర్హత ఏమైనా వుంటే తప్ప అవార్డు రావడం కష్టమండీ" అన్నాడు రాజకీయ ఉపన్యాసాలు రాసివ్వడం అర్హతగా గల తెలుగు లెక్చరర్ గోపాలరావు.

పదవీ విరమణ వయస్సు గురించి-ఉద్యోగులకు అనుకూలంగా తీర్పు వస్తుందని చాలా మంది చెప్పడంతో అన్నయ్య ఆశ చిగురించింది.

* * *

అనుబంధానికీ ఆప్యాయతకూ అర్థాలు తెలియని మావారి మనస్తత్వం నచ్చక మా యింట్లో పది రోజులు మించి వుండలేక పోయారు అన్నయ్యా-వదినా. నేను కూడా ఆయన అభిప్రాయాన్ని అర్థం చేసుకొని మర్యాద కోసం తప్ప వాళ్ళని గట్టిగా వుండమని అనలేకపోయాను. మా బాబు శశి మాత్రం అన్నయ్యకు బాగా చేరువయ్యాడు.

రూళ్ళ కర్రతో బాబుకి గీతలు గీసి పెడుతుంటే-వాడు ఆ కర్రకేసి వింతగా చూస్తే నేను అన్నాను-

"మా చిన్నప్పుడు రూళ్ళు గియ్యడానికి ఇదే ఉపయోగించేవారు. అంకుల్ ఆ తరం మనిషి గనుక ఆ అలవాటు పోలేదు. అప్పుడు టీచర్లు రూళ్ళ కర్రల్లాంటి వారు-మేము ప్లాస్టిక్ స్కేల్స్ లాంటి వాళ్ళం" అని.

అదిగో అప్పట్నుంచీ శశిబాబు-'రూళ్ళ కర్ర మామయ్య' అనే పదం పట్టుకొని వేలాడుతున్నాడు.

ఆ రోజు రేడియో న్యూస్ వినగానే ఎగిరి గంతేశాను- వెంటనే శశిబాబుకు వాడికిష్టమైన సేమియా పాయసం చేసి పెట్టాను.

"ఏమ్మా ఏమిటి విశేషం?" అని అడిగాడు-

"కోర్టు తీర్పువల్ల రూళ్ళ కర్ర మావయ్యకి మళ్ళీ ఉద్యోగమొస్తుందిరా" అన్నాను ఆనందంగా-వాడికి అర్థం కాదనే విషయం మర్చిపోయి అన్నయ్యను స్వయంగా అభినందించాలనుకొంటుండగా ఆ మధ్యాహ్నం పిడుగు పాటులాంటి టెలిగ్రాం-'బ్రదర్ సీరియస్ స్టార్ట్ ఇమ్మీడియట్లీ' అని.

నా ఆందోళనని చూసి ఆయన కూడా నాతో ప్రయాణమయ్యారు. ముగ్గురం టాక్సీ మీద వెళ్ళినాలాం. ఇంటి ముందు ఆగేసరికి-వాతావరణం అర్థమయింది... శేఖరం అన్నయ్య కాదు-తండ్రీ, గురువూ...సర్వం-నాకిక లేదు!

"భగవాన్, ఎందుకిలా జరిగింది? ఆనందాన్ని తట్టుకోలేక గుండె ఆగిపోయిందా?" అనుకుంటూ తడబడుతున్న కాళ్ళతో వెళ్ళి అన్నయ్య భౌతిక కాయం దగ్గర కూలిపోయాను.

చనిపోయే సమయంలో అన్నయ్య గుప్పెట్లో వుందంటూ- ఓ నలిగిపోయిన కాగితాన్ని ఎవరో నా చేతిలో పెట్టారు. అంత దుఃఖంలోనూ ఆసక్తిగా దానికేసి చూశాను.

అది అన్నయ్య యస్.యస్.ఎల్.సి. బుక్‌లో మొదటి పేజీ-దానిలో వెక్కిరిస్తున్నట్టుగా పుట్టిన తేదీ! ఆ రోజుతోనే శేఖరం అన్నయ్యకు ఏభై ఎనిమిదేళ్ళూ నిండాయి!

## సాహితీలోకం

శ్రీశ్రీ భారతిలో సమీక్షలురాసినప్పుడు శ్రీశ్రీ భావాలు బహిర్గతమయ్యేవి. ఎటువంటి 'గిరి' గీసుకోని 1937-38 సంవత్సరాలలో కుందుర్తి నరసింహారావు గారి "యౌవన జ్వాల" కవితా సంపుటిని సమీక్షిస్తూ శ్రీశ్రీ వెలిబుచ్చిన అభిప్రాయాలివి గమనార్హాలు:

"కవిత్వం గురించి అప్రియ వచనాలు నాకు వ్రాయడం ఇష్టం లేదు. ఏ మూల ఒక్క కావ్య నిశ్వాసం వినిపించినా నేను దానికి సానుభూతితో స్పందిస్తాను. అదే గాక సున్నితమైన హృదయాలను అప్రియవాక్కులు ఎంత బాధిస్తాయో నాకు తెలుసు. కాని కొన్ని కొన్ని విమర్శ ప్రమాణాల్ని ఎదుట పెట్టుకొని ఋజు వృత్తితో చేసే చర్యలకు ప్రత్యేకమైన లాభం వుండదని, అటువంటి విమర్శకుల దృక్పథాన్ని అర్థం చేసుకుని మన్నించాలని నా ఉద్దేశం ......... కవికి తన భావం స్పష్టంగా సాక్షాత్కరిస్తే తర్వాత విమర్శకుడికి శ్రమ వుండదు. 'వులుముడు' రెండు రకాలు - రచయిత మనస్సులోనిది, పాఠకుని అవగాహనలోనిది. వీటిలో మొదటిదే ప్రమాదకరం."

— ద్వా.నా.శాస్త్రి

